సాక్షి వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025



శివం.. కేశవం..

జిల్లాలో పలుచోట్ల ఒకే ప్రాంగణంలో శివకేశవుల ఆలయాలు ఉన్నాయి. వైష్ణవ భక్తులు కూడా శివయ్యను దర్శించుకుని పూజలు నిర్వహిస్తారు. - 8లో



ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించాలి

రాయలసీమ ప్రాంతంలోని పెండింగ్ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలని ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి వెంకయ్య డిమాండ్ చేశారు. - 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35.4/21.7

జిల్లాలో ఆదివారం 21.7 – 35.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు వైవీయూ నూతన వీసీ బాధ్యతల స్వీకరణ



ఫణితి ప్రకాష్‌బాబు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య ఫణితి ప్రకాష్ బాబు సోమవారం ఉదయం 10 గంటలకు వీసీ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ గా ఉన్న ఫణితి ప్రకాష్ బాబును వైవీయూ వీసీగా నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఈ నెల 18వ తేదీన జి ఓ ఎం ఎస్ నెంబర్ 6 ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు విశ్వవిద్యాలయం ఏర్పాట్లు పూర్తి చేసింది. బాధ్యతల స్వీకరణ అనంతరం ప్రిన్సిపాల్స్, డీన్‌లు, వివిధ విభాగాల డైరెక్టర్లు, అధ్యాపకులు, సిబ్బందితో విడివిడిగా సమావేశం కానున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కడప సెవెన్‌రోడ్స్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చన్నారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.00 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌ఓ కోరారు.

వీరభద్రుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

రాయచోటి టౌన్: రాయచోటి భద్రకాళి సమేత వీరభద్రస్వామి(రాచరాయుడు) బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో కంకణధార నిర్వహించారు. అనంతరం గుడిలో ఉన్న బావి నుంచి గంగను తీసుకొచ్చారు. కలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన తర్వాత వీరశైవుల విన్యాసాలతో స్వామి వారి ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి పాత రాయచోటిలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయం నుంచి మట్టి సేకరణతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్ ఆర్‌జేడీ రవి

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించి జిల్లాకు మంచిపేరు తేవాలని ఇంటర్మీడియట్ ఆర్‌జేడీ రవి సూచించారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షల విధి విధానాలపై ఆదివారం కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల సెమినార్ హాలులో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లకు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రంలో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా అన్ని మౌలిక వసతులను కల్పించాలన్నారు. ఇంటర్ ఆర్‌ఐఓ బండి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఇంటర్ పబ్లిక్ పరీక్షల కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఏదైనా సమస్య ఉంటే 08562-244171 నెంబర్‌కు ఫోన్ చేసి తగిన సహాయం పొందాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈసీ సభ్యులు వెంకటసుబ్బయ్య, రామిరెడ్డి, శివహరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్-2 అభ్యర్థుల్లో

టెన్షన్.. టెన్షన్..

- ప్రభుత్వం చివరి నిమిషం దాకా స్పష్టత ఇవ్వకపోవడమే కారణం
- గందరగోళం.. మానసిక వేదనకు గురైన వైనం
- కూటమి సర్కార్‌పై నిప్పులు చెరిగిన నిరుద్యోగులు



కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద గ్రూప్-2 పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు

కడప సెవెన్‌రోడ్స్: ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వల్ల నెలకొన్న గందరగోళం పట్ల అభ్యర్థులు మండిపడ్డారు. రోస్టర్‌లో తప్పులు ఉంటే సరిదిద్దేందుకు కావాల్సినంత సమయం ఉన్నా ఆ పనిచేయకుండా పరీక్షకు ఒకరోజు ముందు వరకు కూడా స్పష్టత ఇవ్వకపోవడంతో తాము తీవ్ర ఆందోళనకు గురయ్యామని వాపోయారు. రోస్టర్‌లో తప్పులున్నాయంటూ దాదాపు సంవత్సర కాలంగా ప్రచారంలో ఉన్నప్పటికీ కేసు న్యాయస్థానం పరిధిలోకి వచ్చే వరకు కూటమి ప్రభుత్వం దాన్ని సరిదిద్దకపోవడంలోని అంతర్యమేమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక ఇప్పటికే రెండుమార్లు మెయిన్స్ వాయిదా వేశారన్నారు. రేపు పరీక్ష ఉందనగా, చివరి నిమిషంలో వాయిదా వేయాలంటూ ఏపీపీఎస్సీకి ప్రభుత్వం లేఖ రాయడం వెనుక రాజకీయ కుట్రకోణం ఉన్నట్లు అనుమానించాల్సి వస్తోందన్నారు. తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి డ్రామాలాడారంటూ పలువురు ధ్వజమెత్తారు. కూటమి పెద్దలు వ్యవహరించిన తీరు వల్ల అసలు పరీక్షలు జరుగుతాయో లేదో తెలియని అయోమయ పరిస్థితుల్లో తమ విలువైన సమయం వృథా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి మోసగించిన చంద్రబాబు గ్రూప్-2 మెయిన్స్ విషయంలో కూడా తమ జీవితాలతో ఆడుకున్నారంటూ నిప్పులు చెరిగారు. ఆదివారం కడప నగరంలోని 13 పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులను 'సాక్షి' పలుకరించగా ఇదే విషయాన్ని అభ్యర్థులు ముక్తకంఠంతో చెప్పారు.

ప్రశాంతంగా గ్రూప్- 2 మెయిన్స్ పరీక్షలు



దివ్యాంగుడి హాల్ టిక్కెట్ పరిశీలిస్తున్న పోలీసు



హాల్ టిక్కెట్ నంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో జరిగిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-2 ఉద్యోగాల నియామకం కోసం ఆదివారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించిన మెయిన్స్ పరీక్షకు సంబంధించి.. జిల్లాలోని 13 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 5,825 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా ఉదయం సెషన్‌లో 5,111 మంది అభ్యర్థులతో హాజరు 87.74 శాతంగా, మధ్యాహ్నం సెషన్‌లో 5,825 మందికి గాను 5,096 మంది పరీక్షకు హాజరై అభ్యర్థుల హాజరు 87.48 శాతంగా నమోదైందన్నారు.



పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు పోలీసు అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు పర్యవేక్షించాయన్నారు.



కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న కానిస్టేబుల్

చివరి వరకు గందరగోళమే



గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల విషయంలో ప్రభుత్వ తీరు వల్ల మేము గందరగోళం ఎదుర్కోవాల్సి వచ్చింది. పరీక్షలు వాయిదా పడతాయేమోనని భావించాము. అయితే చివరి నిమిషంలో పరీక్ష జరుగుతుందని ప్రకటించారు. ఇంత గందరగోళం గతంలో ఎన్నడూ చూడలేదు. – నరేష్‌బాబు, రాజంపేట

దూర ప్రాంత అభ్యర్థుల అవస్థ



నేను రాజస్థాన్‌లో ఆర్మీలో పని చేస్తున్నాను. ప్రకటించిన తేదీలో పరీక్ష జరుగుతుందని ఒకసారి, వాయిదా పడుతుందని మరోసారి ప్రభుత్వం నుంచి సంకేతాలు వెలువడ్డాయి. దీంతో దూర ప్రాంత అభ్యర్థులు టెన్షన్ ఎదుర్కోవాల్సి వచ్చింది. -సిద్దేంద్ర, కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా

టెన్షన్ పడ్డాను



చాలా రోజులుగా గ్రూప్-2కు ప్రిపేర్ అయ్యాము. దీనిపై ఎన్నో ఆశలు నింపుకున్నాము. అయితే ప్రభుత్వం వ్యవహరించిన తీరు వల్ల అభ్యర్థుల్లో గందరగోళ పరిస్థితులు అంతటా నెలకొన్నాయి. నేను కూడా చాలా టెన్షన్ ఫీలయ్యాను. -కె.నాగన్న, ప్రొద్దుటూరు

ప్రభుత్వ తీరు బాధాకరం




తాము అధికారంలోకి వస్తే ఏపీపీఎస్సీ, మెగా డీఎస్సీలు నిర్వహించి ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని ఎన్నికలకు ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా కేవలం గ్రూప్-2 పరీక్ష నిర్వహణలో గందరగోళానికి తావివ్వడం బాధాకరం. – గురు, ప్రొద్దుటూరు

కోర్టు కేసు ఏమవుతుందో?



రోస్టర్‌లో తప్పులు చోటుచేసుకున్నాయనే విషయంపై కోర్టులో కేసు నడుస్తోంది. కోర్టు తీర్పు వల్ల వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందో తెలియడం లేదు. ఇప్పుడు పరీక్షలు రాసినా కోర్టు తీర్పుతో ఇవి ఏమౌతాయో అనే ఆందోళన అభ్యర్థుల్లో ఉంది. – శ్రీనివాస్, జమ్మలమడుగు

అప్పుడే.. భగభగ!



- ఫిబ్రవరిలోనే మొదలైన వేడి, ఉక్కపోత
- గరిష్ట ఉష్ణోగ్రతలు పెరగడంతో తగ్గుముఖం పట్టిన చలి
- రానున్న రోజుల్లో మరింత పెరగనున్న ఎండల తీవ్రత
- ఆందోళనలో పిల్లలు, వృద్ధులు



మధ్యాహ్న సమయంలో ఎండ కారణంగా నిర్మానుష్యంగా ఉన్న కడప కోటిరెడ్డి సర్కిల్

కడప అగ్రికల్చర్: వేసవి రాకముందే జిల్లాలో ఎండల తీవ్రత పెరిగింది. రోజురోజుకు భానుడు భగభగమంటున్నాడు. పెరుగుతున్న ఎండల తీవ్రతతో వృద్ధులు, చిన్నారులు అల్లాడుతున్నారు. గరిష్ట, కనిష్ట ఉష్ణోగతలు పెరుగుతుండటంతో చలి తీవ్రత తగ్గింది. ఫిబ్రవరి రెండవ వారం నుంచే ఎండలు ముదరడం ప్రారంభమైంది. ఇక ముందు ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా శివరాత్రి తరువాత ఎండలు ముదురుతాయి. కానీ ఈ ఏడాది శివరాత్రి ముగియక మునుపే ఎండల తీవ్రత పెరిగింది. పైగా రాత్రి వేళలో పొద్దుపోయిన తరువాత చలి కూడా పెడుతోంది. ఈ విచిత్ర వాతావరణంతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

36 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు..

జిల్లాలో పగటి ఉష్ణోగ్రత 36 డిగ్రీలు దాటింది. రాత్రి ఉష్ణోగ్రత కూడా 19 డిగ్రీలు దాటింది. దీంతో ఒక్కసారిగా చలి తీవ్రత తగ్గి ఉక్కపోత ప్రారంభమైంది. జిల్లాలో ఎండల తీవ్రత పెరగడంతో ఇక ఏసీలు, కూలర్లకు పని మొదలైందనే చెప్పాలి. చాలా మంది తమ ఇళ్లలో ఉన్న ఏసీలను సర్వీసింగ్ చేయిస్తున్నారు. వీటితోపాటు కూలర్లు కూడా రిపేరు చేయించుకుంటున్నారు. అలాగే ఎత్తయిన భవనాల్లో ఉండేవాళ్లు కూల్ పెయింట్లను వేసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. గ్రామాల్లో కూడా జనం ఇళ్లపైన, ఆరుబయట పడుకోవడం ఆరంభించారు. మార్చి చివరి నాటికి ఈ ఏడాది 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ఇంత ఎండలేదని ఈ సారి భానుడు భగభగమంటున్నాడని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో గత వారం రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు..

తేదీ	కనిష్టం (డిగ్రీలు)	గరిష్టం (డిగ్రీలు)
17.02.25	18.0	34.0
18.02.24	19.4	35.0
19.02.24	18.4	36.6
20.02.24	21.0	35.6
21.02.24	21.8	33.8
22.02.24	20.9	36.2
23.02.24	21.7	35.4

మార్చి 1వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం

ఈ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు, అలాగే మార్చి 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. బాగా ఎండల తీవ్రత పెరుగుతున్న సమయంలో పరీక్షలు ప్రారంభం కానుండటంతో పిల్లలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పరీక్షలు ఉదయమే ప్రారంభం అవుతాయి కనుక ఎండ తీవ్రత కొద్దిగా తక్కువ ఉన్నా పరీక్ష ముగిసే సమయానికి మాత్రం ఎండలు అదరగొట్టే అవకాశం ఉంటుంది. పిల్లలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకుని ఎండల తీవ్రత నుంచి తప్పించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- బయటకు వెళ్లేటప్పుడు తప్పకుండా గొడుగు లేదా టోపీ వాడాలి.
- తెలుపు రంగు, పలచటి వస్త్రాలతోపాటు లూజుగా ఉన్న దుస్తులనే వాడాలి.
- ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో ఆరుబయట తిరగకూడదు.
- వీలైనని సార్లు నీరు తాగడం, దీంతోపాటు ఎండలో తిరిగే సమయంలో కొబ్బరినీరు, మజ్జిగ, నీటిలో నిమ్మరసం, కాస్తంత ఉప్పు కలిపిన ద్రావణాన్ని తీసుకోవాలి.
- ఎండలో బయటకు వెళ్లినప్పుడు తల తిరగడం, వికారంగా ఉండటం జరిగితే తక్షణం వైద్యులను సంప్రదించాలి.

త్వరగా ఇళ్లకు చేరుకోవాలి



జిల్లాలో ఎండల తీవ్రత క్రమేపీ పెరుగుతూ వస్తుంది. వృద్ధులు, విద్యార్థులు, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండ తీవ్రత పెరగక మునుపే ఉదయం 11 గంటలలోపు పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలి. ఎండలకు ఎక్కువగా తిరిగేవాళ్లు తలపై టోపీలను ధరించడంతోపాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. దీనికి తోడు మంచినీటిని క్రమం తప్పకుండా తీసుకోవాలి. అలాగే పండ్ల రసం, జావ, నీటిశాతం ఎక్కువగా ఉన్న పండ్లను తీసుకోవడం మంచింది. దీంతోపాటు పలుచని వస్త్రాలను ధరించి తగిన జాగ్రత్తలు తీసుకుని ఎండల నుంచి తప్పించుకోవాలి. – డాక్టర్ ఎస్. మహబూబ్‌అలీ, ఎండీ,(ఫిజీషియన్), కడప.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామితో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

బద్వేలు అర్బన్: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, ఎల్లవేళలా అండగా ఉంటామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నాయకులకు, కార్యకర్తలకు భరోసా కల్పించారు. ఇటీవల ఓ భూ వివాదం కేసులో అక్రమంగా అరెస్టయి బెయిల్‌పై విడుదలైన మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామిని పరామర్శించారు.

అలాగే పట్టణంలోని 27వ వార్డు కౌన్సిలర్ రమాదేవి మామ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి శీలి చెన్నయ్యకు జీవనాధారంగా ఉన్న బంకును కక్ష సాధింపు చర్యల్లో భాగంగా మున్సిపల్ అధికారులు తొలగించిన నేపథ్యంలో ఆదివారం వారిని కూడా ఎమ్మెల్యే డాక్టర్ సుధతో కలిసి ఎంపీ పరామర్శించి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై వేధింపులకు పాల్పడటం, అక్రమ కేసులు బనాయించడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. అధికారం ఎప్పటికీ ఒకరికే పరిమితం కాదని, అధికారులు ఆ విషయాన్ని గుర్తుపెట్టుకుని చట్టబద్ధంగా వ్యవహరించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై అధికార పార్టీ నాయకులు చేస్తున్న కక్ష సాధింపు చర్యలను కలిసికట్టుగా సమర్థవంతంగా ఎదుర్కొందామని ఆయన నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు దేవసాని ఆదిత్యరెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ గురుమోహన్, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందరరామిరెడ్డి, బూత్ కన్వీనర్ల విభాగం రాష్ట్ర కార్యదర్శి యద్దారెడ్డి, నగర విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు శీనయ్య, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు ఏర్పాట్లు

లక్కిరెడ్డిపల్లి: శ్రీశ్రీ అనంతపురం గంగమ్మ జాతర మార్చి 1, 2 తేదీల్లో జరగనుంది. ఇందుకోసం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రాకార మండపంతోపాటు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆదివారం కావడంతో వేలాది మంది భక్తులు గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు సమర్పించారు.

జిల్లా సీనియర్ హాకీ పురుషుల జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో హాకీ సెలక్షన్ కమిటీ సభ్యులు

పులివెందుల టౌన్: పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమి క్రీడా మైదానంలో ఆదివారం వైఎస్సార్ జిల్లా సీనియర్ హాకీ జట్టు ఎంపికలు చేసినట్లు జిల్లా సెక్రటరీ శేఖర్ తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. వారిలో ప్రతిభ గల క్రీడారులను జిల్లా సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిందన్నారు. జిల్లా ప్రెసిడెంట్ రవి చంద్ర, జనరల్ సెక్రటరీ ఎం.శేఖర్, సెలక్షన్ కమిటీ సభ్యులు డేవిడ్, సారీ కుమార్, సందీప్ రాజులు ఈ ఎంపికలు నిర్వహించారన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 6 నుంచి 8 వరకు గుంటూరులో జరిగే 15వ రాష్ట్ర హాకీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో 53 గొర్రె పిల్లలు మృతి


మృతి చెందిన గొర్రె పిల్లల వద్ద బాధితులు

కమలాపురం : మండలంలోని పాచికలపాడు గ్రామ పొలాల్లో ఆదివారం కుక్కలు దాడి చేయడంతో 53 గొర్రె పిల్లలు మృతి చెందాయి. బాధితులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సీ గోపులాపురం గ్రామానికి చెందిన చల్లా గొర్ల ఓబయ్యకు చెందిన గొర్రెలను పాచికలపాడు పొలాల్లో మేపడానికి తోలుకెళ్లారు. అందులో గొర్రె పిల్లలను దొడ్డిలో వుంచి గొర్రెలను మేతకు తోలుకెళ్లారు. కంచెను దాటుకుని దొడ్డిలోపలికి దూకిన కుక్కలు దాడి చేసి 53 గొర్రె పిల్లలను చంపాయి. దీంతో సుమారు 2 లక్షల నుంచి 3 లక్షల రూపాయలు నష్టపోయామని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అప్పులు చేసుకుని గొర్రెలను మేపుకొంటూ జీవనం సాగిస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఇంటింటా న్యాయ ప్రచారం


న్యాయ ప్రచారంలో పాల్గొన్న బృందం సభ్యులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇంటింటా న్యాయ ప్రచారంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5202 గృహాలను సందర్శించి 69 మంది ఎదుగుదల లోపాలు ఉన్న పిల్లలను గుర్తించడంతోపాటు దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నంబర్ 14456 ప్రాధాన్యతను వివరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు ఇంటింటా న్యాయ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పుట్టినప్పటి నుంచి 18 ఏళ్లలోపు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించిన సమస్యల గుర్తింపు, నివారణ కోసం ఇంటింటి న్యాయ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 46 బృందాలను ఏర్పాటు చేశారు. అలాగే బృందం సభ్యులు జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం-2024, జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ (నల్సా) వారి మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తులు, మేధో వైకల్యాలున్న వ్యక్తులకు చట్టపరమైన సేవలు పథకం-2024 పథకాలు, వికలాంగుల హక్కుల చట్టం-2016, మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం-2017, జాతీయ మానసిక ఆరోగ్య విధానం-2014, బాల్య వివాహాలు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్‌నంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్‌లైన్ నంబర్ 14456 గురించి తెలియజేశారు.

మోటారు అపహరణ

కొండాపురం : మండల పరిధిలోని గండ్లూరు గ్రామానికి చెందిన పోలు రమణయ్య ఇంటి దగ్గర ఉన్న వ్యవసాయ మోటారును గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి దొంగలించారు. ఈ విషయంపై బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ హాజి బాషా తెలిపారు.

రామయ్యకు విల్లంబులు, బాణాలు సమర్పణ

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామికి బెంగళూరుకు చెందిన జోగారావు శర్మ ఆదివారం రెండు విల్లుంబులు, రెండు బాణాలు సమర్పించారు. ఇవి ఇత్తడివని, వీటి విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందని ఆలయ అధికారులు తెలియజేశారు.

శివమ్ కేశవమ్


పుష్పగిరిలోని శ్రీ చెన్నకేశవ, మల్లేశ్వరస్వామి దేవాలయం (ఇన్‌సెట్) శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ వైద్యనాథేశ్వరస్వామి మూలవిరాట్

- హరిహరులు కొలువైన క్షేత్రాలు
- మహాశివరాత్రికి భక్తులతో కళకళ
- శైవ, విష్ణు భక్తుల విభేదాలు రూపుమాపిన ఆలయాలు

కడప కల్చరల్ : మరో రెండు రోజుల్లో మహాశివరాత్రి రానుంది. ఈ సందర్భంగా జిల్లాలోని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కళకళలాడనున్నాయి. ఈ పండుగను వైష్ణవులు కూడా ఘనంగా నిర్వహించడం విశేషం. జిల్లాలో పలుచోట్ల ఒకే ప్రాంగణంలో శివకేశవుల ఆలయాలు ఉన్నాయి. వైష్ణవ భక్తులు కూడా శివయ్యను దర్శించుకుని పూజలు నిర్వహిస్తారు.

తమ దేవుడే గొప్పంటూ శైవ, విష్ణు భక్తులు పరస్పరం దాడులకు దిగినట్లు పురాణ గాథల ద్వారా తెలుస్తోంది. నిజానికి దేవుడొక్కడేనని పెద్దలు పేర్కొంటారు. కారణాలేమైనా గానీ వందల ఏళ్లుగా శైవులు, వైష్ణవులు ఒకరిపట్ల ఒకరు ద్వేషం పెంచుకున్నట్లు చరిత్ర తెలుపుతోంది. ఫలితంగా ఒకరి ఆలయాలను ఒకరు ధ్వంసం చేసినట్లు కూడా ఆధారాలు ఉన్నాయి. విజ్ఞానం పెరిగాక అలాంటి విభేదాలు సమసిపోయాయి. శివకేశవుల అభేదానికి నిదర్శనంగా జిల్లాలో కొన్ని చోట్ల ఆ ఇద్దరు దేవతా మూర్తులను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసుకుని పూజిస్తున్నారు. ఈ నెల 26వ తేదీన మహాశివరాత్రి నేపథ్యంలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని కొన్ని దేవాలయాల గురించి సాక్షి పాఠకుల కోసం ప్రత్యేకం.

రామలింగేశ్వరాలయం

ప్రొద్దుటూరులోని ముక్తి రామలింగేశ్వర ఆలయంలో శివలింగాన్ని సాక్షాత్తు శ్రీరాముడే స్వయంగా ప్రతిష్ఠించినట్లు తెలుస్తోంది. రావణుడిని చంపిన దోషాన్ని పోగొట్టుకునేందుకు శ్రీరాముడు శివలింగాన్ని ప్రతిష్ఠించాలని ఒకప్పటి దండకారణ్యమైన ఈ ప్రాంతానికి వచ్చారు. ముహూర్తం నిర్ణయించి కాశీ నుంచి శివలింగాన్ని తేవాలని హనుమంతుడిని పంపారు. హనుమ సమయానికి రాలేక పోవడంతో రాముడు స్వయంగా పెన్నానది ఒడ్డున ఇసుకతో లింగాన్ని చేసి స్వయంగా ప్రతిష్ఠించారు. ఆ తర్వాత హనుమంతుడు తెచ్చిన లింగాన్ని కొద్దిదూరంలో ప్రతిష్ఠించారు. రాముడే స్వయంగా శివలింగాన్ని ప్రతిష్ఠించడం శివకేశవుల అభేదానికి తార్కాణంగా తెలుస్తోంది. జిల్లాలోని దాదాపు అన్ని డిపోల నుంచి ప్రొద్దుటూరుకు ఆర్టీసీ బస్సుల సౌకర్యం ఉంది.

వరదరాజస్వామి ఆలయం

అన్నమయ్య జిల్లాలోని చిట్వేలిలో గల శ్రీ వరదరాజస్వామి ఆలయం 17వ శతాబ్దం నాటిదని తెలుస్తోంది. ఇందులో మూలమూర్తిని నల్లరాతితో మలిచారు. నాటి పాలకుడు మట్లి వేంకట రామరాజు కంచి క్షేత్రాన్ని దర్శించినపుడు శివకంచి, విష్ణుకంచి లాగానే మన ఊరిలో కూడా ఆలయాలను నిర్మించాలని ఆయన సతీమణి కోరింది. ఆ కోరికను మన్నించిన రాజు చిట్వేలిలో శివ, వైష్ణవ (శ్రీ వరదరాజస్వామి, శ్రీ శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి) ఆలయాలను ఒకే చోట నిర్మింపజేశారు. ఆ ప్రాంతంలో అప్పట్లో శివ, వైష్ణవ భక్తుల మధ్య వైరాలను తొలగించడానికి ఈ ఆలయాలు ఎంతో ఉపయోగ పడ్డాయట. రాజంపేట, రైల్వేకోడూరుల నుంచి ఈ క్షేత్రానికి ఆర్టీసీ, ప్రైవేటు వాహనాల సౌకర్యం ఉంది. రాజంపేట నుంచి 37 కిలోమీటర్ల దూరంలో ఉంది.

పుష్పగిరి

చెన్నూరు సమీపంలోని పుష్పగిరికి హరిహర క్షేత్రంగా విశిష్టమైన పేరుంది. పెన్నానది పంచనది సంగమంగా మారిన ఈ ప్రాంతంలో చిన్న గుట్టపై శ్రీ చెన్నకేశవస్వామి, పక్కనే శ్రీ మల్లికార్జునస్వామి కొలువై ఉన్నారు. ఈ క్షేత్రం నిత్యం అటు శివభక్తులు, ఇటు విష్ణుభక్తులతో కళకళలాడుతూ ఉంటుంది. గర్భాలయాలు వేర్వేరుగా ఉన్నా ముఖ మండపం, రాజగోపురం ఒకటే ఉండటం విశేషం. ఆ ఇద్దరూ ఒకటేనన్న భావన ఈ నిర్మాణాల ద్వారా అర్థమవుతోంది. కడప నగరం నుంచి ఈ క్షేత్రానికి పది కిలోమీటర్ల దూరం ఉంది. కడప నగరంతోపాటు మైదుకూరు, ఖాజీపేటల నుంచి కూడా బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల సౌకర్యం ఉంది.

దేవునికడప

కడప నగరంలోని దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఆలయానికి సమీపంలో ఉత్తరాన శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం ఉంది. దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించిన రోజుల్లోనే ఈ ఆలయాన్ని కూడా నిర్మించినట్లు తెలుస్తోంది. ఈ రెండింటికీ మధ్యన ఒకే పుష్కరిణి ఉంది. వెంకటేశ్వరుడిని దర్శించుకునే భక్తులు ఆ వెంటనే సోమేశ్వరస్వామిని కూడా దర్శించుకోవడం ఆనవాయితీ. కడప నగర శివారులో ఉన్న ఈ ఆలయాలకు వ్యాన్లు, ఆటోల సౌకర్యం ఉంది.


దేవునికడపలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం

శివ, వైష్ణవ ఆలయాలు

నందలూరులో శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయం ఉన్న విషయం తెలిసిందే. ఒకప్పుడు ఇది శివాలయమని, వైష్ణవ ప్రభావం పెరిగాక వైష్ణావాలయంగా మార్చారన్న కథనం ప్రచారంలో ఉంది. ఆలయ రాజగోపురానికి ఉత్తరాన శ్రీ ఉలగేశ్వరస్వామి ఆలయం ఉంది. అందులో నిలువు నామాల శివలింగం ఉండటం విశేషం. ఈ ఆలయం తమిళ పాలకుల నిర్మాణమని తెలుస్తోంది. తమిళంలో ఉలగం అంటే లోకమని, ఈశ్వరుడు అంటే శివుడని అర్థం. దీంతో ఈ స్వామిని ఉలగేశ్వరుడిగా వ్యవహరిస్తారు. పక్కపక్కనే శివ, వైష్ణవ ఆలయాలు ఉండటం ఈ క్షేత్రం ప్రత్యేకతగా చెప్పవచ్చు. రాజంపేట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ క్షేత్రానికి రాజంపేట, కడప డిపోల నుంచి ఆర్టీసీ బస్సుల సౌకర్యం ఉంది. ప్రైవేటు వాహనాల్లో కూడా వెళ్లవచ్చు.


నందలూరులోని శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయం

సజ్జల భూముల వ్యవహారంలో అనవసర రాద్ధాంతం తగదు

- డిప్యూటీ సీఎం పవన్ ప్రతీకార చర్యలు మాని, పాలనపై దృష్టి సారించాలి
- భూతద్దంలో చూపుతున్న ఎల్లోమీడియా తీరు మార్చుకోవాలి
- వల్లూరు మాజీ సర్పంచ్ బూసిపాటి కిశోర్ ధ్వజం


మట్లాడుతున్న మాజీ సర్పంచ్ బూసిపాటి కిశోర్

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల భూముల వ్యవహారంలో అధికార పార్టీ నాయకులు, ఎల్లో మీడియా అనవసర రాద్ధాంతం చేయడం తగదని వల్లూరు మాజీ సర్పంచ్ బూసిపాటి కిశోర్ అన్నారు. కడపలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. చింతకొమ్మదిన్నె మండలం సుగాలి బిడికి సమీపంలో సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబీకులు చాలా కాలం క్రితమే భూములు కొనుగోలు చేసి తోటలు సాగు చేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఈ భూములు సజ్జల కుటుంబీకులు కొనుగోలు చేసిన సమయానికి.. వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించలేదని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాల్లోకి కూడా రాలేదని చెప్పారు. కానీ ఇప్పటి అధికారపక్షం, ఎల్లో మీడియా మాత్రం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో సజ్జల రామక్రిష్ణారెడ్డి, ఆయన కుటుంబం అక్రమాలకు పాల్పడి ప్రభుత్వ, ఫారెస్ట్ భూములు కొల్లగొట్టారంటూ భూతద్దంలో చూపి, బురదజల్లేలా ప్రచారం చేయడం తగదన్నారు. భూముల్లో సజ్జల దివాకర్‌రెడ్డి, సజ్జల జనార్ధన్‌రెడ్డి, సజ్జల సందీప్‌రెడ్డి కుటుంబ సభ్యుల పేరుతో 146 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని, వీటిలో సజ్జల సందీప్‌రెడ్డి పేరిట 71.49 ఎకరాలు, సజ్జల జనార్ధన్‌రెడ్డి పేరిట 18.85 ఎకరాలు, బాగిరెడ్డి పేరిట 19.22 ఎకరాలు, వై.సత్య సందీప్‌రెడ్డి పేరిట 21.46 ఎకరాలు, సజ్జల విజయ కుమారి పేరిట 7.30 ఎకరాలు ఉండగా, ఇంకా కొంత భూమి కుటుంబ సభ్యుల పేరుతో రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. నిజంగా ఈ భూముల్లో ఫారెస్ట్ భూములు, ప్రభుత్వ భూములు ఉంటే సర్వే చేసి తిరిగి స్వాధీనం చేసుకుంటే తమకేమీ అభ్యంతరం లేదన్నారు. ఇదే విషయాన్ని భూ అక్రమాలు, కదులుతున్న సజ్జల డొంక.. అంటూ ఎల్లో మీడియా ఊదరగొట్టడం మీడియా విలువలకు విరుద్ధమన్నారు. ఈ భూముల వ్యవహారంలో ఎల్లో మీడియా చూపిన అత్యుత్సాహానికి స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కమిటీ వేసి విచారణ చేయాలని ఆత్రుతగా ఆదేశించారని మండిపడ్డారు. వాస్తవం ఏమిటో తెలుసుకోకుండా పవన్ కల్యాణ్ అంత హడావిడిగా ఎల్లో మీడియా ఎదుట స్పందించడం చూస్తే సజ్జల రామక్రిష్ణారెడ్డిని రాజకీయంగా దెబ్బకొట్టేందుకే ఇదంతా చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ఓ వైపు అధికారులు సర్వే చేస్తుంటే బండారం బట్టబయలైందని ఎల్లో మీడియా కథనాలు రాయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారుల విచారణ పూర్తయ్యేంత వరకు ఎల్లో మీడియా ఇలాంటి బురద జల్లుడు కార్యక్రమాన్ని మానుకోవాలని హితవు పలికారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా లేని ఆసక్తిని ప్రదర్శిస్తూ సజ్జల కుటుంబం భూముల్లో ఏదో అక్రమాలు జరిగాయంటూ, వాటిని వెలికి తీస్తామంటూ అతిగా స్పందించడం కూడా హాస్యాస్పదంగా ఉందన్నారు. డిప్యూటీ సీఎం ప్రతీకార చర్యలు మాని, పాలనపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించాలి


ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభల్లో పాల్గొన్న వామపక్షాలు, రైతు సంఘాల నాయకులు


మాట్లాడుతున్న ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగు గంగ, రాజోలి, వెలుగొండ ప్రాజెక్టులకు రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించి సత్వరం పూర్తి చేయాలని ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్, గౌరవ అధ్యక్షులు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. నగరంలోని హరిత ఫంక్షన్ హాల్‌లో రెండో రోజైన ఆదివారం ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్య కరువులతో తల్లడిల్లుతున్న రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నీటి కడగండ్లు తీర్చాలని.. కరువు, వలసలు, ఆత్మహత్యల విముక్తికి శాశ్వత పరిష్కారం చూపాలని దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు పోరాటాలు సాగిస్తున్నా పాలక ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయని విమర్శించారు. భూ విస్తీర్ణం, మానవ వనరులు సమృద్ధిగా కలిగిన ఈ ప్రాంతంలో తగినన్ని నిధులు కేటాయించి, నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేస్తే ప్రతి గ్రామానికి తాగునీరు ప్రతి ఎకరాకు సాగునీరు అందించి జీవన సస్యశ్యామలం చేయొచ్చని అన్నారు. అనేక పోరాటాల నేపథ్యంలో చేపట్టిన గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగు గంగ, వెలుగొండ, రాజోలి ప్రాజెక్టు పనులు నిధుల లేమితో నత్తనడకన సాగుతున్నాయన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్లక్ష్యానికి నికర జలాలను కోల్పోవాల్సి వచ్చింది అన్నారు. మిగులు జలాలపై ఆధారపడి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులకు బ్రిజేష్ కుమార్ ట్రిబునల్ తీర్పు మరణ శాసనంగా మారిందన్నారు. నీటి వివాదాలను పరిష్కారం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం జటిలం చేస్తూ వివాదాస్పద బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌ను తిరిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కేటాయించిన నీటిని పునసమీక్ష చేసేందుకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం, ఎగువభద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించడం రాయలసీమ నోట్లో మట్టి కొట్టడమే అన్నారు. ఇది వరకే నిర్మాణంలో ఉన్న, పూర్తయిన ప్రాజెక్టులకు అనుబంధంగా పంట కాలువల నిర్మాణం చేపట్టి ఆయకట్టును అభివృద్ధి చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ.. పాలక ప్రభుత్వాలు మారిన సందర్భంలో కొత్త ప్రాజెక్టుల పేరుతో నిధులను కొల్లగొట్టే పథకాలకు శ్రీకారం చుడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2025 వార్షిక బడ్జెట్లో నీటిపారుదల ప్రాజెక్టులకు 15 శాతం నిధులు కేటాయించి ఖర్చు చేసి సత్వరం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాంతాల నీటి అవసరాలకు తగ్గట్టుగా ప్రాజెక్టుల నిర్మాణం జరగలేదన్నారు. కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఏ కాటమయ్య, జగన్నాథం, జమలయ్య, ఎలమందరావు, మల్లికార్జున, అప్పలనాయుడు, రంగారెడ్డి, బాబు, ఎంవీ సుబ్బారెడ్డి, పి.భాస్కర్, టి.మనోహర్‌రెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, కేసీ బాదుల్లా, సి. సుబ్రమణ్యం, జి.మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బిల్టప్ నుంచి రామకృష్ణ హైస్కూల్‌కు వెళ్లే దారిలో పోలేరమ్మ గుడి- అంబాభవానీ దేవాలయం మధ్యలో ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ లైన్‌వైర్లు ఒకదానికి ఒకటి తగులుకుని నిప్పురవ్వలు రాలి నిప్పంటుకుంది. దీంతో వచ్చిన మంటలు సెలూన్ షాపు, పాతసామాన్ల అంగడికి అంటుకుని కాలుతున్నాయని అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి బసివిరెడ్డితో కలిసి అగ్నిమాపక శాఖ వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. మంటలను ఆర్పివేశారు. ఆదివారం రోజునే పోలేరమ్మ తిరునాల ఘనంగా జరుగుతోంది. సంఘటన స్థలానికి దగ్గరలో వున్నందున తిరునాల సందర్భంగా వచ్చిన ప్రజలకు గానీ, ఏర్పాటు చేసుకున్న దుకాణాలకు గానీ ఎలాంటి ప్రమాదం సంభవించకుండా అగ్నిమాపక శాఖ వారు, కడప తాలూకా పోలీసులు తమ వంతుగా కృషి చేశారు.

వక్ఫ్ భూములను కాపాడాలి


మాట్లాడుతున్న ఏఐసీసీ కోఆర్డినేటర్ సత్తార్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ భూములను కాపాడాలని ఏఐసీసీ కోఆర్డినేటర్ ఎస్ఏ సత్తార్, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజులు, నవాబులు, ధనవంతులు వక్ఫ్ కోసం భూములు, ఇతర ఆస్తులు వందల ఏళ్లుగా దానం ఇస్తూ వచ్చారన్నారు. ఈ వక్ఫ్ ఆస్తుల ఆదాయాన్ని విద్యాసంస్థలు, శ్మశాన వాటికలు, మసీదులు, అనాథ శరణాలయాలు తదితర వాటి నిర్వహణకు వినియోగిస్తారన్నారు. అందువల్ల ముస్లింలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. 1954లో కాంగ్రెస్ పార్టీ వక్ఫ్ చట్టాన్ని తీసుకువచ్చి వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేసిందన్నారు. దేశంలో ఆర్మీ, రైల్వేల తర్వాత ఎక్కువ భూములు ఉన్నది వక్ఫ్ బోర్డుకే ఉన్నాయన్నారు. అయితే దేశం, రాష్ట్రం, జిల్లాలోనూ అనేక వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అయ్యాయన్నారు. ముస్లింలు అంటే గిట్టని బీజేపీ ప్రభుత్వం పౌరసత్వ చట్టం, ఉమ్మడి పౌరస్మృతి, ట్రిపుల్ తలాక్ లాంటి చట్టాలు చేయడమే కాక కాశ్మీరులో ముస్లింలకు ఉపయోగపడే 370 ఆర్టికల్‌ను రద్దు చేసిందన్నారు. ఇప్పుడు వక్ఫ్ సవరణ బిల్లు ద్వారా ముస్లింలకు ఆర్థికంగా ఉపయోగంగా ఉన్న వక్ఫ్ చట్టాన్ని బలహీనపరచడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు పార్లమెంటులో మొదటిసారి ప్రవేశపెట్టినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ఇండియా కూటమిలోని పార్టీలు పెద్ద ఎత్తున వ్యతిరేకించడం వల్ల జాయింట్ పార్లమెంటు కమిటీ ఏర్పాటు చేశారన్నారు. తిరిగి ఫిబ్రవరి 13న ప్రవేశపెట్టినప్పుడు మళ్లీ పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చిందన్నారు. అయితే తిరిగి మార్చి 10వ తేదీ నుంచి జరగబోవు పార్లమెంటు సమావేశాలలో బీజేపీ తమ బలంతో చట్టంగా చేయబోతోందన్నారు. ఈ బిల్లు పూర్తిగా మత స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడి అన్నారు. ఈ కార్యక్రమంలో రెవల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ సుబ్బరాయుడు, కాంగ్రెస్ పార్టీ కడప కో ఆర్డినేటర్ బండి జకరయ్య, జిల్లా కార్యదర్శి గౌస్పీర్, ఎస్సీ, ఎస్టీ హ్యూమన్ రైట్స్ జేవీ రమణ, బీసీ మహాసభ అవ్వారు మల్లికార్జున, సిరాజుద్దీన్, కైపు రామాంజనేయులు, హరి ప్రసాద్, చాంద్ బాషా పాల్గొన్నారు.

వివాహేతర సంబంధంతోనే హత్య

- కేసు ఛేదించిన పోలీసులు
- నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

జమ్మలమడుగు : వివాహేతర సంబంధం ఓ వ్యక్తి ప్రాణాలు తీసింది. ఈ హత్య కేసును పోలీసులు ఛేదించి, నిందితులను అరెస్ట్ చేశారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎర్రగుంట్ల మండలం చిలంకూరు గ్రామం ఎస్సీ కాలనీలో ఈ నెల 15న కంభం శివరామిరెడ్డి హత్యకు గురయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇందులో వెల్లడైన విషయాలు ఇలా ఉన్నాయి. చిలంకూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన గని అరుణతో రెండేళ్ల నుంచి వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. అయితే ఇటీవల ఆమె ఇంటి ఎదురుగా ఉన్న ఆదెన్నతో సైతం వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న విషయం శివరామిరెడ్డికి తెలియడంతో, ఇద్దరినీ మందలించాడు. ఈ విషయాన్ని గని అరుణ తల్లిదండ్రులతోపాటు గ్రామంలో తెలియజేస్తానని బెదిరించాడు. దీంతో శివరామిరెడ్డిని అడ్డు తొలగించుకోవాలని ఆదెన్నతో కలిసి ఆమె పక్కా ప్రణాళిక రచించింది. అందులో భాగంగా ఈ నెల 15న రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి పిలిపించుకుంది. శివరామిరెడ్డి ఇంటికి రాగానే అతని కంట్లో కారం కొట్టగా.. ఆదెన్న తాడుతో మెడపై గట్టిగా బిగించి చంపేశారు. శవాన్ని ఎవరూ చూడకుండా అక్కడి నుంచి ఒక ఆటోలో తీసుకుపోయి తొండూరు మండలం మల్లెల ఘాట్‌లో పడేశారు. అంతేకాకుండా సెల్‌ఫోన్, చెప్పులు, చంపడానికి ఉపయోగించిన తాడును.. సాక్ష్యం ఉండకూడదని కాల్చేసి బూడిదను కాలువలో పడేశారు. నిందితులుగా ఉన్న ఆదెన్న, గని అరుణను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. విలేకరుల సమావేశంలో ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ దుర్మరణం


మృతి చెందిన డ్రైవర్ షేక్ రెడ్డిపల్లె గైబూసా


పెన్నానదిలో బోల్తా పడిన ట్రాక్టర్

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు మండల పరిధిలోని రామేశ్వరం ఆర్టీపీపీ రోడ్డులో ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ షేక్ రెడ్డిపల్లె గైబూసా (36) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరుకు చెందిన గైబూసాకు 14 ఏళ్ల క్రితం నంద్యాల జిల్లా రుద్రవరం గ్రామానికి చెందిన ప్యారీతో వివాహమైంది. అతను ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్తుంటాడు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ క్రమంలో 7 ఏళ్ల క్రితం గైబూసా కుటుంబం రుద్రవరం గ్రామానికి వెళ్లి స్థిరపడింది. కొన్ని రోజుల నుంచి గైబూసా ప్రొద్దుటూరులోని ఈశ్వరరెడ్డినగర్‌లో ఉన్న మనోహర్ అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా వెళ్తున్నాడు. వారం రోజుల క్రితం గైబూసా రుద్రవరం నుంచి ప్రొద్దుటూరుకు వచ్చాడు. ఆదివారం ఉదయం అతను మనోహర్ ట్రాక్టర్ తీసుకొని ఇసుకను తీసుకొచ్చేందుకు పెన్నానదిలోకి బయలుదేరాడు. ఆర్టీపీపీ రోడ్డులోని దోబీ ఘాట్ వద్దకు వెళ్లేసరికి ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను తప్పించబోయే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి ప్రమాదవశాత్తు పెన్నానదిలో బోల్తా పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ గైబూసాను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని రూరల్ ఎస్ఐ మహమ్మద్‌రఫి పరిశీలించారు. భార్య షేక్ రెడ్డిపల్లె ప్యారీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.